
# ఐ.పి.

- శిరంశెట్టి కాంతారావు



వర్షాకాలం సాయంత్రం.

లేత నారింజ రంగులో ఎండ కాస్తోంది.

సన్నసన్న తుంపర పడుతోంది.

భూమ్యాకాశాలను కలుపుతూ అద్భుతంగా ఇంద్రధనస్సు ఏర్పడి మెరిసిపోతోంది.

సందు మొదట్లో చిన్నపిల్లలు 'ఎండా వానా, కుక్కల నక్కల పెళ్లిళ్లు' అంటూ కేరింతలు కొడుతూ గంతులేస్తున్నారు.

సింహాద్రి ఆకాశంకేసి చూస్తూ తనలో తనే

'అబ్బ ఎంత పెద్ద శింగిడి ఏసిందే' అనుకుంటున్నాడు.

ఇంతలో సింహాద్రి తండ్రి యాకయ్య

'సింఆద్రీ! సింఆద్రీ' అంటూ సింహాద్రి దగ్గరకొచ్చాడు.

'ఆ శింగిడిని ఏం జూస్తావ్? ఇయ్యాలే కొత్తగా జూస్తున్నట్టు! తొందరగా పోదాం దా' అంటూ సింహాద్రిని తెగ తొందరపెట్టాడు.

'ఒకపక్క చినుకులే పడుతుంటే ఎక్కడికి?'

'ఎక్కడికేంది'

ఎరకాలువ నీరు తీసింది. చెరువు అలుగు పొయ్యి కిష్టల కలుస్తుంది. ఇప్పుడే మరి కిష్టచాప ఎదురెక్కేది.

నిన్న వరదకు కాలవ బంధం తెగింది కదా. దాన్ని ఇప్పుడు కట్టాలి.

ఈ రాత్రికన్నా 'మావులు' ఎట్టకపోతే ఎట్లా?!'

'సర్లే పోదాం పా'

తండ్రీ కొడుకులిద్దరూ ఆ చినుకుల్లోనే ఎరకాలువ బంధం కట్టేందుకు బయలుదేరారు

సింహాద్రికి ఇరవై ఏళ్లు. మనిషి పీలగా, చామనచాయలో వయస్సుకు తగ్గ ఎత్తుంటాడు. పదవ తరగతి గట్టెక్కలేక, అమ్మా నాన్నలతో చాపలు పట్టడం చేస్తున్నాడు.

చాపల చెరువు సొసైటీలో సింహాద్రి కూడా సభ్యుడే. అందర్లోకి చదువుకుందీ సింహాద్రే. ఆకారం ఎలా ఉన్నా మంచి కలుపుగోలు, మాటకారి, డబ్బుల విషయంలో గట్టివాడు.

ఈ సంవత్సరం వర్షాలు బాగా ఉండటంతో చెరువులు, కుంటలు నిండి పొర్లటంతో చాపలు కూడా బాగా పడ్డాయి.

ఒకరోజు

సొసైటీ సభ్యులందరూ ఎండచాపల కల్లంలో ఎండుతున్న చాపల్ని చెప్పు కాళ్ళతో తొక్కుతున్నప్పుడు సొసైటీ సభ్యుల్లో అందరికన్నా పెద్దవాడు నారాయణ సింహాద్రితో

'ఏంద్రా, సింఆద్రీ! అయ్యా కొడుకులు సంపాదిస్తున్నారు కదా? ఏం జేస్తున్నార్రా డబ్బులన్నీ. బ్యాంకులో ఏస్తున్నారా? వడ్డీలకు తిప్పుతున్నారా?' అన్నాడు.

'డబ్బులా! యాడియి, మావా!'

లంక మేతకూ, ఏటి ఈతకూ సరి అన్నట్టుంది మా సంపాదన. వచ్చేది వంకాయ, వడిచేది గుమ్మడికాయ. డబ్బులాడ పాడైనై' అంటూ సింహాద్రి తండ్రి యాకయ్య నారాయణకు బదులిచ్చాడు.

'ఏంద్రా! యాకయ్యా! అంత ఉలికిపడుతున్నవ్? మేమేదో తాతా మనవళ్లం పరాసికానికి వందనుకుంటం నీదేం బాయె? మీ సంగతి నాకు తెలియదా?'

'ఆ దాందేముందిలే చెప్పు తాతా! బ్యాంకుల్లో దాచేరో జొస్తె తప్పుద్దా' అన్నాడు సింహాద్రి నారాయణతో.

'ఏం లేదురా తాతా! మనందరం కల్సి ఓ చిట్టీ ఏస్కుందాం రా. మాలో సద్దుకున్నోడివి నువ్వే కదా! అందుకే ఆ చిట్టీ ఏదో నువ్వే నడుపు. కాకపోతే చాకిరీ చేసినందుకు మొదటి చీటీ పాట లేకుండా నువ్వే ఉంచుకో'

'అట్లనే అంటవా? తాతా! సరే కానియి'

ఆ రకంగా చాపల చెరువు సొసైటీ సభ్యులు తమ డబ్బులు మదుపు చేసుకోవటం కోసం కోరకుండానే సింహాద్రిని ఓ చిట్టీకి ఓనర్‌ను చేసి పాతిక వేలు ఒకేసారి చేతికి వచ్చేటట్లు చేశారు.

తేనె రుచి మరిగిన ఉడుము ఎంత ఎత్తుకైనా పాకుతుంది. ఎంత బరువైనా మోస్తుంది.

డబ్బు సంపాదించడం అనే తేనె రుచి మొదటిసారిగా సింహాద్రికి తెలిసొచ్చింది.

'నాయినా, సింఆద్రీ! పాతిక వేలు! ఏం జేద్దాంరా?' అన్నాడు యాకయ్య.

'ఏం జేద్దాం? చెప్పు'

'ఒక పని చేద్దాం. చాపల దాణా తెచ్చి ఈ సుట్టుపట్ల సొసైటీలోల్లకు అమ్ముదాం. మనకు తెలిసిన యవ్వారం. అందరూ మనోళ్లేనాయె'

'సరే! అట్లనేచై సింఆద్రీ'

అనుకున్నదే తడవుగా చాపల దాణా వ్యాపారం మొదలుపెట్టాడు సింహాద్రి. ఊరూరూ, చెరువు చెరువూ తిరిగి దాణా అమ్మకం చేస్తూ నాలుగు రాళ్లు కళ్లజూస్తున్నాడు.

'ఎట్లాగూ ఈ యాపారం కోసం ఊరూరూ తిర్గుతూనే ఉన్నాను కదా! దీనికితోడు ఇంకా కోళ్ల దాణా, పశువుల దాణాలు కూడా పెడితే పోలా?' అనుకున్న సింహాద్రి వాటిని కూడా తెచ్చి చిన్నచిన్న కోళ్ళ ఫారాల వాళ్లకూ, రైతులకూ అమ్మటం మొదలుపెట్టాడు.

ఈ దెబ్బతో కోళ్ల ఫారాల వాళ్లతోనూ, పెద్ద రైతులతోనూ పరిచయాలు బాగా ఏర్ప[illegible]ది మంది దృష్టిలో పడ్డాడు.

ఈ వ్యాపారాలు చేస్తూనే సింహాద్రి కొత్తకొత్త చిట్టీ మొదలుపెట్టాడు.

ఇంటింటికీ తిరిగి కొత్త కొత్త సభ్యులను చేర్చుకున్నాడు. వాళ్లకు పదీ, పరకా అవసరమైతే ఆదుకున్నట్టు ఇస్తూనే వడ్డీలు గుంజడం నేర్చుకున్నాడు.

సింహాద్రి ఊళ్లో పెద్దవాళ్లు 'ఆ సింఆద్రీగాడు చూడంద్రా! నిన్న మొన్నటిదాకా చెర్లో చాపలు పట్టినోడు. ఇయ్యాల రెండు చేతులతో ఎట్లా సంపాదిస్తుండో! మీరూ ఉన్నారెందుకు? తిండి దండగ?' అంటూ సింహాద్రికి పైసా ఖర్చు లేకుండా ప్రచారం చేయసాగారు.

★ ★ ★

'సింఆద్రీ!

ఎట్లాగూ దాణాలు అయీ అమ్ముతున్నావ్. [illegible]ా మందితో ఇచ్చి, పుచ్చుకొనుడు చేస్తున్నావ్. అందుకే నేనో మాట చెబుతా ఇనుకో. పస్తుతం నా దగ్గిర లచ్చ రూపాయలు క్యాష్ ఉంది. అది నువ్ తీసుకొని వడ్డీకి తిప్పుకో నాకో పావలా ఇయ్యి. నువ్వో పావలా తిను. ఏంధి?' అంటూ ఆ ఊరి మోతుబరి పద్దయ్య సింహాద్రికి ఓ మంచి ఆఫర్ ఇచ్చాడు.

'లచ్చ రూపాయలు పదిమందికి ఇచ్చేకన్నా నమ్మకస్తుడైన ఒక్కడికిస్తే వాడి దగ్గర నెలనెలా వడ్డీ తీసుకోవచ్చు. రిస్క్ లేకుండా డబ్బులొస్తాయి' ఇది పద్దయ్య ఆలోచన.

'ఇదేదో బాగనే ఉందే. నా డబ్బులు కావు. ఇటు తీసికోవటం - అటు ఇవ్వటం. మధ్యలో కమీషన్ వస్తుంది. సరే అంటే పోలా?' అనుకున్నాడు సింహాద్రి.

ప్రతి సంబంధం వ్యాపార బంధమే. ఎవరి స్వార్థం వారిది. ఎవరి లాభం వారిది.

★ ★ ★

సింహాద్రిని చాలా రోజులుగా గమనిస్తున్న కాంట్రాక్టర్

కనకరాజు తనకున్న ఒక్కగానొక్క అవిటి కూతుర్ని ప్రయోజకుడైన అతనికి కట్టబెట్టాలని చాలారోజుల నుంచి అనుకుంటూ అదను కోసం వేచి చూస్తున్నాడు.

ఇంతలో ఒకరోజు

'కనకరాజుగారూ! మీతో పనుండి వచ్చాను'

'ఆ... ఏం పనో చెప్పండి రామాచారిగారు. ఊరకరారు మహానుభావులని మిమ్మల్ని చూడగానే అనుకున్నా, విషయం లేందే రారని' అంటూ వచ్చిన రామాచారితో అన్నాడు కాంట్రాక్టర్ కనకరాజు.

'అయ్యయ్యో! అట్లా అనకండి కనకరాజుగారూ! మీలాటోళ్లతో మాకు ఏదో పని ఉంటూనే ఉంటుంది. రాకా తప్పదు, మీరు చెయ్యకా తప్పదు'

'ఇంతకూ పనేంటో చెప్పనే లేదు'

'మీరు తలుచుకుంటే అయ్యే పనే. నాకు చాలా మేలు చేసినోళ్లౌతారు'

'అరే! ఇంతకూ విషయం చెప్పండి'

'మా అమ్మాయికి పెళ్లి కుదిరింది కనకరాజుగారూ'

'సంతోషం. ఏ ఊరు? పిల్లగాడేం జేస్తుండు? కట్న మె కనకరాజు ప్రశ్న మీద ప్రశ్న గుప్పించాడు.

'ఆ పని మీదనే మీ దగ్గరకొచ్చాను. పిల్లగాడు డిగ్రీ పాసై ఖాళీగా ఉంటున్నాడు. మీరు కొంచెం పెద్ద మనసు చేసుకొని, మీరు కాంట్రాక్టు చేస్తున్న డిపార్ట్‌మెంట్‌లో ఏదో ఓ చిన్న ఉద్యోగం వేయిస్తే కట్నం లేకుండా పిల్ల పెళ్లై ద్ది'

ప్రతి పనిని లాభనష్టాలతో బేరీజు వేసుకునే కనకరాజు తలలో వెంటనే ఓ ఆలోచన రూపుదిద్దుకుంది.

'రామాచారిగారూ! ఉద్యోగం వేయించడమంటే మాటలా? అయినా ఆడపిల్ల పెళ్ళి అంటున్నారు...'

'చెప్పండి కనకరాజుగారూ! ఆపారేంటి?'

'ఏం లేదు చారిగారూ! నాకూ ఓ పిల్లుంది కదా. దానికీ పెళ్ళి చెయ్యాలి. అందుకని మీరో పని చెయ్యండి'

'ఏంటో చెప్పండి'

'ఆ యాకయ్య కొడుకు సింహాద్రికి మనమ్మాయి నిద్దాం. మీరు వాళ్లతో ఏం మాట్లాడుతారో ఏమో. మీ ఇష్టం. కావల్సినంత కట్నమిస్తా. పిల్ల అవిటిది. ఈ సంబంధమైతే ఊళ్లోనే కళ్లముందుంటుందని ఆశ'

'వార్నీ కనకరాజూ! పెద్ద ప్లానే వేశావురా రాజా! కుంటి దానికి చాకులాంటి సింహాద్రికి లింకు పెట్టావా తండ్రీ' అని మనసులో అనుకున్న రామాచారి పైకి మాత్రం

లోచన బాగుందండీ'

'బాగుండటం కాదు. మీక్కాబోయే అల్లుడికి ఉద్యోగం కావాలంటే మీరీ సంబంధం కుదిరించండి. నాకు అర్జంట్ పని ఉంది వెళతాను'

'కనకరాజుగారూ! ఇక విషయం నాకొదిలేయండి. కానీ, మా అల్లుడి ఉద్యోగం సంగతి మాత్రం మర్చిపోవద్దు. సరేనా'

'సరే కానివ్వండి'

ఇలా నడుస్తున్నాయి మానవ సంబంధాలు. ఇద్దరు వ్యక్తుల స్వార్థం ఒక యువకుడి జీవితాన్ని నిర్దేశించే ఆలోచనలకు ప్రాణం పోసింది.

★ ★ ★

రామాచారి సింహాద్రి తండ్రి యాకయ్యతో

'యాకయా! మీ వాడికి మంచి సంబంధం చూశాను. కాంట్రాక్టర్ కనకరాజు గారమ్మాయి. ఒక్కతే పిల్ల. బొచ్చెడు కట్నమిస్తాడు. మీ వాడు ఇంకా పైకిపోయే ఛాన్స్ నీ ఇంటి ముందుకు నడిచొచ్చింది'

'అయ్యో! ఆ పిల్ల అవిటిది కదండీ. చూస్తా చూస్తా అవిటిదాన్ని చేసుకుంటామా? '

'కట్నందేముందండీ. ఈడూ జోడూ బాగుండాలిగాని'

ఈ సంభాషణంతా వింటున్న సింహాద్రి తనలో తాను

'ఆ కుంటి దైనంత మాత్రాన పెళ్ళి చేసుకోకూడదా? నేను కాకపోతే మరొకడెవడో చేసుకోడా? దానికి పెళ్లి కాదా? కనకరాజు మామైతే బంగారు గుడ్లు పెట్టే బాతు నా గూట్లో ఉన్నట్టే గదా. మా అయ్యకేం తెలియదు. దాన్నే చేసుకుంటే పోలా' అనుకున్నాడు.

జీవితంలో రాజీ పడటం నేర్చుకుంటే మనిషి ఎంతో సుఖపడతాడు.

★ ★ ★

ఇప్పుడు సింహాద్రి ఓ డబ్బులున్న ఆసామికి అల్లుడు.

అతని రూపురేఖలే మారిపోయాయి.

మెడలో చైన్, చేతికి బ్రాస్‌లెట్, వేళ్లకు రంగురంగుల ఉంగరాలు, మోటార్‌సైకిల్‌తోపాటు లక్షల కట్నంతో భార్య. ఒక్కడే అల్లుడు.

తంతే గారెల బుట్టలో పడ్డట్టుంది సింహాద్రి పరిస్థితి.

సింహాద్రి చిట్టీల వ్యాపారం ఇంకా జోరందుకుంది.

లక్షలు చిట్టీలు పాడిన వాళ్ళు కూడా డబ్బులు వడ్డీలకు తిప్పమని సింహాద్రికే ఇస్తున్నారు. తను కూడా నెలనెల కచ్చితంగా వడ్డీలు ఇస్తూ, చిట్టీలు పాడిన సభ్యులకు వెంటనే బ్యాంకు చెక్కులు ఇస్తూ మంచి నమ్మకస్తుడిగా పేరు సంపాదిస్తున్నాడు.

> 'కుంటి దైనంత మాత్రాన పెళ్ళి చేసుకోకూడదా? నేను కాక పోతే మరొకడెవడో చేసుకోడా? దానికి పెళ్లి కాదా? కనకరాజు మామైతే బంగారు గుడ్లు పెట్టే బాతు నా గూట్లో ఉన్నట్టే గదా. మా అయ్యకేం తెలియదు. దాన్నే చేసుకుంటే పోలా'

ఆ నమ్మకమే మరింత వ్యాపారపు పెట్టుబడిగా మారింది.

సింహాద్రి ఎదుగుదల వామనుణ్ణి మించిపోతుంది.

'సింహాద్రిగారూ! పట్నంలో మంచి సెంటర్లో ప్లాట్లున్నాయి సార్. ముందు ముందు మంచి బెనిఫిట్ ఉంటుంది'

'మీరూ ఓ రెండు ప్లాట్లు తీసుకోండి బాగుంటుంది' అంటూ ఓ రోజు ఒక రియల్ ఎస్టేటు కంపెనీ వాళ్లు సింహాద్రిని కలిశారు.

'అబ్బో! కష్టమండీ! నా దగ్గర అంత డబ్బు లేదు'

'చూడండీ సింహాద్రిగారూ! మీ దగ్గర డబ్బు లెక్కడికి పోతాయి. ఉన్నపుడివ్వండి. అసలు మా దగ్గర ఓ స్కీం కూడా ఉంది సార్'

'ఏంటది?'

'మా దగ్గర పదిమందిని చేర్పించిన వాళ్ళకు ఒక ప్లాట్ ఫ్రీ. ఎట్లాగూ మీకు ఎంతోమంది తెలుసు. వాళ్ళందర్నీ చేర్పించండి. ఫ్రీ ప్లాట్లొస్తాయిగా' అంటూ ఆ రియల్ ఎస్టేట్ వాళ్లు వాళ్ల స్కీం వివరాలు మొత్తం విడమర్చి చెప్పారు.

సింహాద్రి తన చిట్టీల సభ్యులను, పరిచయస్తులను రియల్ ఎస్టేట్ స్కీంలో చేర్పించి మొత్తం మీద మూడు ఫ్రీ ప్లాట్లు సంపాదించాడు.

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఇప్పుడు సింహాద్రి కూడా భాగస్వామి అయ్యాడు.

'అల్లుడూ మా ఇంటికి దగ్గర్లోనే ఓ బిల్డింగ్ అమ్మకానికొచ్చింది తీసుకుంటావా?' అనుకుంటూ సింహాద్రి మామ కాంట్రాక్టర్ కనకరాజు ఫోన్ చేశాడు.

'వద్దు మామగారూ! మొన్ననే చూస్తిరిగా పట్నంలో ప్లాట్లు తీసుకొంటిమి' ఆ ప్లాట్లు ఫ్రీగా వచ్చిన సంగతి మామకు తెలియనట్టే కావాలనే తెలివిగా మామ దగ్గర దాచాడు.

'అమ్మో అల్లుడూ నీ తెలివితేటలు నా దగ్గర కూడా చూపిస్తున్నావే' అని మనసులో అనుకొని పైకి మాత్రం.

'ఆ దాందేముంది లేవయ్యా! మంచి సెంటర్లో ఉంది తీసుకో. ముందు ముందు ఏ వ్యాపారం పెట్టినా నడుస్తుంది. అద్దెలకిచ్చిన బొచ్చెడు పైసలు. కావాలంటే కొంత సర్దుతాలే, ఉన్నప్పుడిద్దువుగాని' అంటూ సింహాద్రి చేత బిల్డింగ్ కొనిపించాడు.

సింహాద్రి తన భార్యద్వారా మామగారు బిల్డింగ్ కోసం ఇచ్చిన డబ్బులు కాస్తా 'ఇంకేమిస్తార్లే ఉంచుకోండి' అన్పించాడు.

ఒకరిది బిడ్డ మీద ప్రేమ. మరొకరిది ముద్దొచ్చినప్పుడే చంకెక్కాలన్న పాలసీ. ఏమైనా లాభం సింహాద్రికే.

సింహాద్రికి డబ్బు, పరపతి ఎంత పెరుగుతుంటే మనశ్శాంతి అంత దూరమవసాగింది. దాంతో మనుషుల మీద కంటే కనిపించని దేవుళ్ల మీద భక్తి, నమ్మకం ఎక్కువైంది.

ఊళ్లో ఏ గుళ్లో చిన్న కార్యక్రమం జరిగినా సింహాద్రి లేకుండా జరగటం లేదు. అతని పేర ప్రతిరోజూ గుళ్ళల్లో అర్చనలు ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి.

తన మీద తనకు నమ్మకం సన్నగిల్లే మనిషి క్రమంగా తనకు తెలియకుండానే మానసిక స్థైర్యం కోసం దేవుడనే నమ్మకం వైపు మొగ్గుతుంటాడు.

★ ★ ★

'సింహాద్రిగారూ! మా ఊళ్లో పది ఎకరాల మామిడి తోట అమ్మకానికి వచ్చింది. ఆ తోటగలాయన పిల్లలు అమెరికాలో ఉంటారు. అందుకే అతను కూడా అన్నీ అమ్ముకొని వాళ్ల దగ్గరకు పోదామని చూస్తున్నాడు. అందుకే చౌకగా ఇస్తానంటున్నాడు. లేత తోట. ఎవరికిచ్చినా ప్రతి ఏటా డబ్బులే తీసుకోండి బాగుంటుంది' అంటూ చిట్టీ సభ్యుడొకడు సింహాద్రితో అన్నాడు.

'ఆ నాకెందుకండీ! ఉన్న వాటితోనే ఛస్తున్నా. ఇంకా ఆ తోటలు, దొడ్లూ ఎక్కడ పెట్టుకోను'

'అయ్యో! మీకర్థం కావట్లేదండీ. అంత లేత తోట అంత చౌకగా వస్తుంటే కాదంటున్నారు. మీరు తీసుకోండి. ఇంకా తగ్గించేలా చూద్దాం'

అంటూ ఆ చిట్టీ సభ్యుడు ఆ తోట ఆసామి ఇచ్చే కమీషన్ కళ్ళ ముందు మెదులుతుంటే, మొత్తం మీద సింహాద్రితో తోట కొనిపించి మూడో కంటికి తెలియకుండా తన కమీషన్ తాను తీసుకున్నాడు.

★ ★ ★

'సింహాద్రిగారూ! పట్నంలో మీ ప్లాట్ల చుట్టూ బిల్డింగులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు చాలా లేచాయి. మీరెందుకింకా ఏమీ కట్టట్లే' అనుకుంటూ ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ వాళ్లు సింహాద్రి దగ్గరకొచ్చారు.

'ఇప్పుడిప్పుడే అటువంటి ఆలోచన లేదండీ'

'డబ్బులున్నప్పుడు చూద్దాం' అన్నాడు సింహాద్రి.

'డబ్బులు గురించి మీరేం ఆలోచించకండీ. ఆ సంగతి మాకొదిలెయ్యండి. మా ఫరం ద్వారా బ్యాంకు లోను ఇప్పిస్తాం. దాంతో మంచి షాపింగ్ కాంప్లెక్స్ కట్టండి.

(మిగతా 12వ పేజీలో)

# పొగరాని పెట్రోల్!

‘అబ్బా! ఈ బండికి పెట్టే పెట్రోల్‌కే నా సగం జీతం హారతి కర్పూరంలా అయిపోతోంది. ఇక దీన్ని మెయింటెయిన్ చేయడం నా వల్ల కాదు బాబూ!’ అనే టైపు మాటలు మనలో చాలామంది ఒకసారి కాకపోతే మరోసారైనా మననం చేసుకున్న అనుభవం కలవారే అనడానికి పెద్దగా సాహసమేం అక్కర్లేదు. అలాగని వెహికల్ వదిలేసి పనులు చేసుకోవాలన్నా, ఈ ఆధునిక జీవన శైలిలో కొద్దిగా కష్టమైన పనే! మరి మధ్యే మార్గం ఏదీ లేదా? తడిసి మోపెడవుతున్న ఈ ఇంధన ఖర్చును మౌనంగా భరించాల్సిందేనా? వేరే దారి లేదా? అని వాపోయే వారికో తీపి కబురును ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వారణాసికి చెందిన ఓంకారనాద శ్రీవాత్సవ మోసుకొచ్చారు. అది - ఇకపై భగ్గున మండే పెట్రోల్ ధరకు దాసోహమనకుండా ప్రత్యామ్నాయ ఇంధనంగా హైడ్రోజన్‌ను వెహికిల్స్‌కు ఉపయోగించవచ్చుని.

### పదేళ్ళ కృషి ఫలితం

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శ్రీవాత్సవ దాదాపు పదేళ్లుగా అవిశ్రాంతంగా చేసిన కృషి ఫలితమే ఈ హైడ్రోజన్ తరహా ప్రత్యామ్నాయ ఇంధనం ఆవిర్భవించింది. దీని ఆధారంగా నడవడానికి అనువైన ఇంజను మార్పులు చేయడానికి 20 నుంచి 30 వేలు మాత్రమే ఖర్చవుతుందనీ, డెబ్బై నుంచి 85 కిలోమీటర్లకు సరిపడా సామర్థ్యం దీనికుందని శ్రీవాత్సవ ఢంకా భజాయించి చెప్తున్నారు. అయితే పెట్రోల్ ఖర్చుతో చూస్తే ఎంత ఆదా చేయచ్చు వంటివి హైడ్రోజన్ ఎంతవరకూ అందుబాటులో ఉంటుంది అనే వాటిపై ఆధారపడి వున్నా ఇంచుమించు దానికయ్యే వ్యయంలో మూడో వంతు మాత్రమే అవుతుందని ఆయన అంటున్నారు. పైగా ఇది కాలుష్య రహితం కూడా. కేవలం వెహికల్స్‌కే కాక ఇంధన ఆధారిత ఇతర ప్రక్రియలకు కూడా దీన్ని నిరపాయంగా వాడచ్చు అంటున్నారు శ్రీవాత్సవ.

### ఇంటర్నెట్‌లో ఆరాలు

చమురు సంక్షోభం కేవలం భారత దేశాని కొక్కదానికే చెందినది కాదు. అంతర్జాతీయంగా అంతో ఇంతో అన్ని దేశాలూ అనుభవిస్తూనే ఉన్నాయి. అందుకే ఇలాంటి



ప్రత్యామ్నాయ ఇంధనం హైడ్రోజ...
...గ మాయం అంటున్నాడు శ్రీవా...

తక్కువ ఖర్చు ఫార్ములాలు ఎక్కడ ఉన్నా ఠక్కున పట్టుకోవడానికి అందరూ ప్రయత్నిస్తారు. అలాంటి ప్రయత్నాల జడి తననూ తాకిందని శ్రీవాత్సవ అంటున్నారు. ‘అప్పుడే నా ఇంటర్‌నెట్‌లో దీనిని గూర్చి సమాచారం అడగడమే కాక అలాంటి బైక్ తయారుకావడానికి భారతీయ కరెన్సీలో ఎంతవుతుందో చెప్పు అని కూడా సంప్రదించేస్తున్నారు’ అని ఒకింత ఉత్సాహంగా, కొంత ఆందోళనగానూ అన్నారాయన. ఆందోళన ఎందుకంటే పరదేశీయులకు ఏ మాత్రం దీన్ని గురించి ఐడియాను ఊహామాత్రంగా ఇచ్చినా వారికి అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానం ఆసరాతో ఈ ప్రయోగాన్ని వారమలు పరచి ఆధిపత్యం వహించేస్తారు కనుక.

### దేశీయమంటే ఇంత చులకనా?

తను ఎంతో కష్టపడి ఈ మాదిరి ప్రయోగాన్ని సఫలీకృతం చేసి చూపిస్తే దీనికింకా అధికారికంగా ఆమోదం లభించడం లేదు. అంతులేని జాప్యం జరుగుతోంది. కారణాలుగా ఒకవేళ హైడ్రోజన్‌ను పెట్రోల్‌కు ప్రత్యామ్నాయంగా వాడామంటే దీని నిల్వ, మార్కెట్ ఎలా అంటున్నారు. మరి ఇదే ఫార్ములా విదేశీయుల నుంచి వస్తే మారు మాట్లాడకుండా అంగీకరించి అమలు చేసేస్తారు’ అంటూ ఓ చురక కూడా తగిలించేశారు శ్రీవాత్సవ. ఇప్పటికే అభివృద్ధి చెందిన అనేక దేశాలు ప్రత్యామ్నాయ ఇంధనం కోసం పదేపదే అన్వేషిస్తున్నాయి. అలాంటిది కేవలం చమురు కోసం డెబ్బై శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్నా మన దేశం లాంటి దేశం తక్షణమే దృష్టి సారించాల్సి ఉంది. దీన్ని ఇలాగే వదిలేస్తే ఆర్థిక సంక్షోభ దిశగా భారతావని వెళ్ళే ప్రమాదముంది. ఇది గమనించే భారత సాంప్రదాయేతర మంత్రిత్వ శాఖ ఈ తరహా ప్రత్యామ్నాయ ఇంధన పరిశోధనల కోసం బడ్జెట్‌ను కేటాయించి పలువురిని ప్రోత్సహిస్తోంది. అలాంటి ప్రోత్సాహం శ్రీవాత్సవకు మరింత వేగంగా అందాలి. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ సంవత్సరం డిసెంబరు నాటికి సంబంధిత మంత్రిత్వ శాఖ అధికారిక ఆమోదం లభించి శ్రీవాత్సవ కలలు వాస్తవం అవుతాయని అందరూ ఆశిస్తున్నారు. అదే నిజమైతే మన గాడీల ఇంధన వ్యయంలో పొదుపే పొదుపు.

**-అన్వేషి**

---

*(9వ పేజీ తరువాయి)*

వచ్చే రెంట్ల మీద బ్యాంకు ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టెయ్యొచ్చు.

తర్జన భర్జనల తర్వాత సింహాద్రి బ్యాంకులోను తీసి పట్నంలో షాపింగ్ కాంప్లెక్స్ కట్టించాడు.

సప్తవర్ణాల వెలుగు జిలుగుల ఇంద్రధనస్సు జీవితమెంత?

సింహాద్రి ఎదుగుదల ఎటు పోతుంది?

ఎన్ని చేసినా ఆర్థిక పునాది బలంగా లేని సింహాద్రి వ్యాపార లావాదేవీల్లో ఎదురుదెబ్బలు తినడం అడపాదడపా మొదలైంది.

అసలే దేవుళ్లు, పూజలు, వ్రతాలు అంటూ తిరిగే సింహాద్రికి ఈ మధ్య కొత్తగా వాస్తుపిచ్చి ఒకటి పట్టుకుంది.

దాంతో ఎవరు ఏది చెబితే అది చేస్తూ ఇల్లు, షాపింగ్ కాంప్లెక్స్, మామకొనిచ్చిన బిల్డింగ్‌తోసహా అన్నింటినీ మార్పులు చేర్పులు చేయించాడు.

మానసికంగా బలహీనుడైన మనిషి అపజయాన్ని ఎదిరించి గెలవాలన్న ప్రథమ సూత్రాన్నే మర్చిపోతాడు.

అటువంటి స్థితిలోనే దేవుళ్లని, వాస్తులని, స్వామీజీలని, సన్యాసులని వాళ్ల చుట్టూ దీపం చుట్టూ పురుగుల్లా తిరుగుతుంటారు. సింహాద్రి దానికి మినహాయింపు కాదు.

పరిస్థితులు క్రమంగా తన చేయి దాటుతున్నాయని సింహాద్రి గ్రహించాడు.

చాపల చెరువుల నాటి నుండి ఇప్పటివరకూ తనను నమ్మిన వారితోబాటు తమ, తమ స్వార్థం కోసం తన చుట్టూ చేరిన వారితోపాటు అనేక మంది మధ్యతరగతి చిట్టీ సభ్యులనూ తన స్వార్థం కోసం వంచించాడు.

ఫలితంగా

సింహాద్రి పేరుమీదున్న ఆస్తులు మూడో కంటికి తెలియకుండా భార్య పేరు, బామ్మర్దుల పేరా మారిపోయాయి.

బ్యాంకుల్లో అక్కౌంట్లు క్లోజ్ చేయబడ్డాయి.

మొత్తం విషయం చాపకింది నీరులా జరిగిపోయింది.

చిట్టీల సభ్యులకూ, వడ్డీలకు తిప్పమని ఇచ్చిన ఖాతాదార్లు దిమ్మెరపొయ్యేలా హఠాత్తుగా ఒకరోజు అన్ని పత్రికల జిల్లా ఎడిషన్లు ‘లక్షలాది రూపాయలు దిగమింగి దివాళా తీసిన మరో వ్యాపారి కన్పించటంలేదు’ అనే వార్త బాక్స్‌లు కట్టి మరీ ప్రచురించాయి.

లబోదిబోమంటూ అనేక మంది సింహాద్రి ఇంటి ముందు పోగయ్యారు.

‘మీ ఆయన ఎక్కడికెళ్ళాడు? ఎప్పుడొస్తాడు?’

‘నాకు తెలియదు. నాకు చెప్పి పోలేదు’ ఎంతమంది అడిగినా సమాధానం ఒక్కటే.

సమాధానం వినీ వినీ విసిగిపోయిన కొందరు సింహాద్రినీ, సింహాద్రి భార్యనూ ఇష్టమొచ్చినట్టు తిట్టిపోశారు.

అందరూ కల్సి మొత్తం మీద ఓ కోటి రూపాయలకు లెక్కలు తేల్చారు.

‘ఆ డబ్బులకూ మాకూ సంబంధం లేదు’

‘ఈ ఆస్తులన్నీ నా బిడ్డకు నేను ఇచ్చుకొన్నవే’ అంటూ సింహాద్రి మామ వచ్చిన జనంతో అన్నాడు.

కోపం పట్టలేని కొందరు సింహాద్రి మామ మీద చెయ్యి చేసుకున్నారు.

ఈ అవకాశం కోసమే ఎదురుచూస్తున్న సింహాద్రి మామ కనకరాజు ఇక విజృంభించాడు.

‘నా బిడ్డ అవిటిది. దానికి మా అల్లుడు చేసిన అప్పులకూ ఏ సంబంధం లేదు. ఆడపిల్ల అందులోనూ అవిటిది అని కూడా చూడకుండా కొట్టారు. తిట్టారు’ అంటూ చిట్టీల సభ్యుల మీదా, వడ్డీలకు ఇచ్చిన వారి మీదా పోలీసుస్టేషన్‌లో కేసులు పెట్టారు.

అంతటితో ఆగకుండా తన కూతురితో ఒక్కొక్కరి మీదా కోర్టులో పరువు నష్టం దావాతోపాటు, ‘అట్రోసిటీస్’ కేసులు ఫైల్ చేయించి లాయర్ నోటీసులు పంపించాడు.

డబ్బులు పోగొట్టుకుని, అవసరాలు తీరక అనేక ఇబ్బందులు పడుతున్న చిట్టీల సభ్యులు, డబ్బులు మదుపు పెట్టిన వాళ్ళూ కేసుల చుట్టూ తిరుగుతుంటే...

మెల్లగా ఐపీ దాఖలు చేసిన సింహాద్రి పట్నంలో బినామీ వాటాదార్ల పేరుతో మామగారి సహాయంతో మరో కొత్త వ్యాపారం మొదలుపెట్టాడు.

సమాజంలో గొర్రెలకేం కొదువ?! ★